సకుటుంబ ఆహ్లాద వీచిక

# చినుకు

మాసపత్రిక

ISSN 2455-4111

నవంబర్ 2016

₹20/-



బాలల దినోత్సవ శుభాకాంక్షలు

సకుటుంబ ఆహ్లాద వీచిక సమాచార దీపిక

చినుకు మాసపత్రిక

సంపుటి : 12 సంచిక : 8

140

సంపాదకులు
**నండూరి రాజగోపాల్**
సెల్ : 98481 32208

**1, నవంబర్ 2016**

**పేజీలు : 60**

అసోసియేట్ ఎడిటర్
**జనార్ధన్ లంకె**
సెల్ : 98485 36113

ఫీచర్స్ ఎడిటర్
**సింగంపల్లి అశోక్ కుమార్**
సెల్ : 98485 04649

పబ్లికేషన్ కన్సల్టెంట్
**కె.రఘురామరాజు**
సెల్ : 98493 50555

అలంకరణ
జనార్ధన్

**చందా వివరాలు**

| | |
|---|---|
| సంవత్సర చందా | :₹. 200/- |
| 3 సంవత్సరాలకు | :₹. 500/- |
| 5 సంవత్సరాలకు | :₹. 800/- |
| జీవిత చందా | :₹. 5000/- |

U.S.A.- 30 $

చందాలు ఎం.ఓ.రూపంలో 'చినుకు' పబ్లికేషన్స్, విజయవాడ" పేర ఈ క్రింది చిరునామాకు పంపవలెను.

26-7-11, గరికపాటివారి వీధి,
సురేష్ మూవీస్ ఎదురుగా,
గాంధీనగర్, విజయవాడ - 3.

E-mail : editor.chinuku@gmail.com
editor_chinuku@yahoo.com

## ఈ సంచికలో...

### శీర్షికలు

**రాగరంజితం** 28
ఇంద్రగంటి జానకీబాల
**జగమంత కుటుంబం** 36
జగద్ధాత్రి
**సప్తవర్ణ లేఖ** 42
మల్లీశ్వరి
**మావూరి మనుషులు** 45
బి.వి.రామిరెడ్డి
**ఓ మహాత్మా... ఓ మహర్షీ...!** 49
హెచ్చార్కె

### సమీక్షలు

**మురికిమీద వెలుగు రవ్వలు** 30
**మంచి కవిత్వం కోసం పోలీసు విజలు** 31
పన్నాల సుబ్రహ్మణ్య భట్టు

### కథలు

**నేనూ, పి.వి.శివం** 6
డా॥ వి.చంద్రశేఖరరావు
**ఆరు వంకాయల దొంగ** 20
సామాన్య
**విముక్తి** 32
నాదెళ్ల అనూరాధ
**బృందావన చందమామ** 39
వడలి రాధాకృష్ణ
**సౌందర్య శాసనం** 52
వి.ప్రతిమ

### కవితలు

**స్వర్గం తర్వాత, నరకానికి ముందు** 9
కె.శివారెడ్డి
**నేల రాలుతున్న దృశ్యం** 11
నిఖిలేశ్వర్
**కొత్త భాష కావాలి** 23
సిహెచ్.వి.బృందావనరావు
**సాధన** 29
ర్యాలి ప్రసాద్
**ఇట్టే దుఃఖం రానీ....!** 35
జనజ్వాల
**మిస్‌ఫైర్** 38
శ్రీరామ్
**శూన్యం** 41
డా॥పెళ్లకూరు జయప్రద సోమిరెడ్డి

### వ్యాసావళి

**పాతికేళ్ల కథానిక :**
**స్త్రీ పురుష సంబంధాలు** 12
విహారి
**తెలుగు ప్రాధికారిక సంస్థ**
**సాంకేతిక వెలుగు** 17
డా॥జి.వి.పూర్ణచందు.

### ఇంకా...

**కాశీపతి ఒక రెడ్ శాల్యూట్** 27
సింగంపల్లి అశోక్ కుమార్
**ప్రియమైన నీకు** 58
ప్రియతమ్

కథలకు బొమ్మలు : వెంకట్




# పత్రికోత్సాహం

**అక్టోబరు 2016 'చినుకు'లో** భాషాకాలుష్య నివారణ వ్యవస్థ 'నుడికావలి' అనే డా॥జి.వి.పూర్ణచంద్ వ్యాసంలోని కొన్ని నిర్ధారణలపై నాకు అభ్యంతరాలున్నాయి. 'కంచే చేను మేసినట్టు' అని మనకొక సామెత వుంది. అలాంటప్పుడు కావలి చేనును కాపాడలేదుగదా అని అర్థం చెప్పుకుంటే–నుడికావలి వ్యవస్థ పక్షులనుండి పంటను కాపాడగలుగుతుందేమో కాని, కంచే బందిపోటు దొంగగా మారిపోతే ఏం చేయగలదు? ముఖ్యంగా గడిచిన పాతికేళ్ళుగా– సామ్రాజ్యవాద ప్రపంచీకరణానికి పాలకులు లొంగిపోయిన కాలం నుండి–మనల్నేలిన, ఏలుతున్న ప్రభుత్వాలే తెలుగుకే కాదు– ఇంగ్లీషు భాషావికాసానికి కూడా అడ్డుపడుతూ, ఆంగ్లభాషా మాధ్యమం పేరిట బట్లర్ ఇంగ్లీషు నేర్పుతూ విద్యావ్యాపారం చేస్తున్న వర్గాలకు పెద్దకావలిగా వుంటూ, తెలుగు చేనును మేస్తున్న కంచెలగా మారిపోయాయని గ్రహించకపోతే, భాషాభిమానుల వేదన అరణ్యరోదనగా మిగిలిపోక తప్పదని మరొకసారి చెప్పక తప్పటం లేదు. ఇది నా అభిప్రాయం మాత్రమే. నాకు అభ్యంతరం ఎప్పుడు కలుగుతుందంటే చేనును మేసే కంచెకు కాపలా కాసే ప్రయత్నం చేసినప్పుడు.

అయితే ఈ సందర్భంగా నా అభ్యంతరం మరొక కీలక అంశంలో వుంది. డా॥జి.వి.పూర్ణచంద్ వ్యాసంలో వున్న ఈ క్రింది వాక్యాలు చూడండి. "అమ్మ కడుపులో మావిపొరల మధ్య పెరుగుతున్న బిడ్డ మనసు అమ్మ భాషలోనే రూపొందుతుందని పరిశోధనలు చెప్తున్నాయి. అమ్మ కడుపులో బిడ్డ ఏ భాషలో పెరుగుతాడో ఈ భూమ్మీద పడిన క్షణం నుండి ఆ భాషలోనే ఎదుగుతాడు. అనుక్షణం మనిషి మనసులో మెదిలే ప్రతి ఆలోచనా అతని మాతృభాషలోనే రూపు కట్టుకుంటుంది."

తల్లి కడుపు నుండి బయటకు వచ్చిన క్షణం నుండే మాట్లాడుతూ, పరుగిడుతూ పుట్టిన మానవులిప్పటికి ఆవిర్భవించలేదు. "గొడ్డు అరుపు కేక నుండి అక్షరపదస్వరితం"గా జరిగిన భాషోత్పత్తి క్రమమంతా మానవ సమూహాల నడుమ జరిగిందే కాని తల్లికడుపులో జరగలేదు. భాషోచ్ఛారణకు భౌతిక అవసరమైన అభివృద్ధి చెందిన దంతాల పొందిక, స్వరపేటిక నిర్మాణ ప్రక్రియలో వానరం నుండి నరునిగా రూపుదిద్దుకోవటానికి సామూహికంగా మానవబృందాలు జీవనసంఘర్షణలో పడిన శ్రమ క్రమంలోనే అవి సాధ్యపడినాయి. మానవుల మెదడు నిర్మాణంలో కూడా ఈ అభివృద్ధి క్రమం వుంది. అయినా పుట్టిన కొన్ని నెలల తర్వాత తప్ప మాటలు నేర్వడం మానవుడికి సాధ్యపడదు.

మానవుడికి భాష పుట్టుక రీత్యా రాదు. తల్లి కడుపులో అసలే రాదు. పెరిగే క్రమంలో మాత్రమే వస్తుంది. మనిషికి అలవడే భాషను నిర్ణయించేది అతని పుట్టుక కాదు, పెరిగే క్రమంలో ఏర్పడే మానవసంబంధాలు, ఆ మానవులు అప్పటికే అలవరుచుకొని రూపొందించి వున్న భాషా వాతావరణం తప్ప కన్నతల్లి కాదు. సాధారణంగా అత్యధికులు తల్లి పెంపకంలో, కుటుంబ సభ్యునిగా, ఏదోవొక భాషా సమూహం నడుమ పెరుగుతారు కనుక వారి ద్వారా నేర్చుకున్న భాష మాత్రమే అలవడుతుంది. దానినే మనం తల్లి భాష, ఇంటిభాష అంటున్నాము. అంతేగాని ఏ తల్లీ బిడ్డల్ని భాషతో సహా కనలేదు. భాష– తల్లి కడుపులోనే రూపొందే పదార్థం కాదు.

అత్యధికులు భాషను తమ తల్లుల ద్వారానే మొదామొదలు నేర్చుకుంటారన్నది ఎంత నిజమో, ఆ తల్లులు, వారిని కన్న తల్లుల తల్లులు కూడా పుట్టుకతో భాషను వెంట తెచ్చుకోలేదనీ, వారంతా సామాజికులయే క్రమంలోనే సొజ్ఞలూ, శబ్దాలు, స్వరాలు, అక్షరాలు, పదాలు, వాక్యాలు నేర్చుకున్నారన్నది కూడా అంతే సత్యం. ఇక అందరి 'రాతకూ' గుడులూ, దీర్ఘాలు కట్టేది బడిలోని గురువులే కదా!

భాష రాకుండా భావాలు వాటి వ్యక్తీకరణ, భావాలు లేకుండా బుద్ధి దానికి ఊహలు, ఊహ లేకుండా మనసు దానికొక భావజాలం ఏర్పడవు. ఈతకొట్టటం, సైకిల్ తొక్కటం నేర్చుకున్నట్టు ఇవన్నీ పెరిగే క్రమంలో అలవర్చుకునేవి మాత్రమే. సంస్కృతికి జీవగర్ర భాష కనుక గత జన్మల నుండీ, పూర్వజన్మల సుకృత, దుష్ఫలితాలుగా కాక అవి మానవులు పెరిగే సామాజిక వారసత్వమూ,వర్తమాన జీవన సంఘర్షణ నుండి మాత్రమే నిర్మాణ మవుతాయి. భాషకు వ్యక్తిగత స్వభావమే లేదు. అది మానవులు పెంపొందించుకున్న సామాజిక శక్తి. మానవభాషలన్నిటికీ కన్నతల్లి ఆయా మానవసమూహాల సమష్టి శ్రమ. భాష విషయంలో మనం తప్పనిసరిగా ప్రేమించవలసిన కన్నతల్లి ఈ సమష్టిశ్రమ.

మానవుల సమష్టి శ్రమద్వారా పోగుపడే సంపదల్ని వ్యక్తిగతంగా మార్చుకునే వర్గాలే, భాషల వికాసానికి ఆటంకంగా పరిణమిస్తున్నాయి. ఆ ఆధిపత్యవర్గాలు ఏర్పాటు చేసుకున్న రాజ్యం అనే కంచెలే భాష అనే పంటల్ని కొల్లగొడుతున్నాయి. భాషాభిమానులు నిజంగా ఒక కాపు కాయాల్సిన చోటు అదీ!!

**– దివికుమార్, విజయవాడ**

### అక్టోబర్ 'చినుకు' ఉత్తమ రచయితలు

***'చినుకు' అక్టోబర్ సంచికలో ప్రచురించిన కథలలో ఉత్తమ కథగా జి.లక్ష్మి రచించిన 'హోమం', కవితలలో ఉత్తమ కవితగా డా॥లక్ష్మీనారాయణ గంగిశెట్టి రచించిన 'ఏదీ మా మందువా లోగిలి' ఎన్నికయిందని తెలియజేయడానికి సంతోషిస్తున్నాము. ఉత్తమ కథకు శ్రీ యండమూరి వీరేంద్రనాథ్ ప్రకటించిన రెండువేల రూపాయల నగదు, ఉత్తమ కవితకు 'శ్రీమతి సుశీల నారాయణ రెడ్డి ట్రస్ట్' ప్రకటించిన రెండువేల రూపాయల నగదు పురస్కారాలు పంపబడతాయి. ఈ సందర్భంగా రచయితలను అభినందిస్తూ వీరేంద్రనాథ్‌గారికి, 'శ్రీమతి సుశీల నారాయణ రెడ్డి ట్రస్ట్' వారికి 'చినుకు' ధన్యవాదాలు తెలియజేస్తోంది.***

# సంపాదకీయం

## అభివృద్ధి అంటే...

**ఏమిటి?** అనే ప్రశ్న ఆలోచించే ప్రతి ఒక్కరినీ ఆందోళనకు గురి చేస్తోంది. అభివృద్ధి అంటే ఏమిటి? ఎందుకు ఈ అభివృద్ధి? అసలు అభివృద్ధి ఎలా ఉండాలి...? అనే మూడు మౌలిక ప్రశ్నలకి వర్తమాన సమాజంలో జవాబుల్లేవు. జవాబు చెప్పేవారు లేరు. కాని అడిగే వాళ్ళు మాత్రం అసహాయులుగా ఉండిపోయారు. చిత్రమేమిటంటే ఈ ప్రశ్నలను ప్రజలు మాత్రమే అడగడం లేదు, చరిత్ర అడుగుతోంది. సంస్కృతి అడుగుతోంది. కాలం అడుగుతోంది. ఈ అడగడం అనేది ప్రాసెస్‌లో ఉన్నప్పుడు బహుశా ఏ దేశ పౌర సమాజం కూడా ప్రశాంతంగా ఉండలేదు. ఏ రాజ్య వ్యవస్థా కూడా ఎక్కువ కాలం మౌనాన్ని ఆశ్రయించలేదు. అదే సమయంలో దౌర్జన్యాన్నీ కొనసాగించలేదు. ఇంతకీ, ఈ అభివృద్ధి సమస్య మళ్లీ ఎందుకొచ్చిందంటే...బెంగుళూరులో ఫ్లయ్‌వోవర్ నిర్మాణానికి జనం స్వచ్ఛందంగా నిరసన తెలియచేయడం చూసినపుడు అసలు అభివృద్ధి ఏం చేస్తోంది...అన్నది ప్రాథమిక ప్రశ్నగానే మళ్ళీ అందరినీ తరుముతోంది.

అనేక రకాల పురాతన కట్టడాలని, భవంతులని, స్మారక చిహ్నాలని, పెద్ద పెద్ద వృక్షాలని, ధ్వంసం చేసుకుంటూ జరిగే అభివృద్ధి ఎవరి గురించన్నది ఇప్పుడు అందరూ అడుగుతున్న ప్రశ్న. మామూలుగా అయితే బెంగుళూరు ఫ్లయ్‌వోవర్ విషయంలో ఇంత సీరియస్‌గానూ, సమిష్టిగానూ స్పందన ఇంత స్థాయిలో రాకూడదు. అయితే అభివృద్ధి కోసం రెండు తెలుగు రాష్ట్రాలలోనూ జరుగుతున్న విధ్వంసం అభివృద్ధి అంటేనే భయం కలిగిస్తోంది. కొత్త రాజధాని పేరిట, కొత్త పరిశ్రమల పేరిట, కొత్త కారిడార్ల పేరిట, కొత్త ఆనకట్టల పేరిట ఊళ్లకు ఊళ్ళే కనుమరుగవుతున్నప్పుడు, పచ్చటి పంట పొలాలు బీడులుగా మారుతున్నప్పుడు, ఏడాదికి మూడు పంటలు పండే ఊళ్ళు కూలికోసం వలస వెళుతున్నప్పుడు, దిగుమతిచేసే స్థానంలోంచి ఎగుమతి చేసుకునే దుస్థితికి దిగజారుతున్నప్పుడు అసలు అభివృద్ధి ఎందుకు అనే ప్రశ్న వస్తుంది.

అయితే, మారుతున్న కాలం ప్రకారం కొన్ని సౌకర్యాలు అమర్చుకోవలసిన అవసరం కలుగుతుంది. ఆకాశంలోనూ, నీటిలోనూ, నేలపైనా రవాణా వ్యవస్థ కోసం, వేగవంతమైన పరిపాలన కోసం, ప్రజలకు మౌళికమైన సౌకర్యాలను అందించడంకోసం ఈ అభివృద్ధి వినియోగ పడితే పర్వాలేదు కాని, వీటికి అతీతంగా కేవలం కొంతమందికి మాత్రమే ఉపయోగపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఇవాళ ప్రతి ఒక్కరూ గొంతెత్త వలసిన అవసరం వుంది. గంటలో వెళ్లవలసిన ప్రయాణం అరగంటకి కుదించడానికి ఆ నగరానికో, ఆ రాష్ట్రానికో మూలమైనటువంటి, సంస్కృతీ సంబంధ చిరునామాలనే ధ్వంసం చేయాలంటే మాత్రం అది మాటల కందని నేరం. ఇంకా చెప్పాలంటే 'కన్న తల్లిని దూషించినంత నేరం, కన్న తల్లిని ద్వేషించినంత పాపం'.

మన రాష్ట్రంలో జపాన్ నమూనాలు, సింగపూర్ నమూనాలు అంటూ ఎన్నెన్నో కొత్తకొత్త కట్టడాలకి ప్రణాళికలు వేస్తున్నారు. కాని మనదైన అవసరాలకి సరిపోయే నిర్మాణముంటేనే, మనం పెట్టే ఖర్చుకు, వెచ్చించే సమయానికి, వినియోగించే స్థలానికీ సార్థకత. అంతేకాని ఎక్కడో ఏదో కట్టారని మనం కూడా భుజాలు తడుముకుంటే చివరికి మనం నిలబడడానికి కూడా చిన్న జాగాన్ని ఇతరుల నుండి కొనుక్కోవలసి ఉంటుంది. న్యూయార్క్‌లోని ఎంపైర్ స్టేట్ బిల్డింగ్‌ను స్ఫూర్తిగా తీసుకుని 1970లో బెంగుళూరులో నిర్మితమైన పబ్లిక్ యుటిలిటి బిల్డింగ్ ఇప్పటికీ సగభాగం పైనే ఖాళీ ఉన్నది. ఈ మధ్య కాలంలో విమానాశ్రయాలు, హైవేలు, జల విద్యుత్కేంద్రాలు, డామ్‌లులాంటి భారీ ప్రాజెక్టులను నిర్మించేందుకు రాష్ట్ర లేదా కేంద్ర ప్రభుత్వం ఏ ప్రైవేటు కంపెనీకైనా కాంట్రాక్టునిస్తే ఆ ప్రాజెక్టు వ్యయంలో చెప్పుకోదగిన భాగం అధికారంలో ఉన్న రాజకీయ నాయకులకు, రాజకీయ పార్టీలకు చేరుతుంది.

దీనిలో భాగంగానే అందరూ వ్యతిరేకిస్తున్న బెంగుళూరు ఫ్లయ్‌వోవర్‌ను ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం హడావుడిగా బలవంతంగా ఫైనలైజ్ చేసి, ఈ ప్రాజెక్టు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఇచ్చే ముడుపులతో ఆ పార్టీ ఇతర రాష్ట్రాలలో రానున్న అసెంబ్లీ ఎన్నికలను ఎదుర్కోవచ్చు అన్నది ఒక ఆరోపణ. ఇలాంటి రాజకీయ అపసవ్య దిశలో నిర్వాసితులుగా మారుతున్న ప్రజలు కాని, చరిత్రలో కలిసిపోతున్న ప్రాంతాలు కాని, కనుమరుగై పోతున్న సాంస్కృతిక కట్టడాలు కాని మన దేశంలో లెక్కకుమించి ఉండడం దురదృష్టం.

ఇప్పటికైనా నిజమైన అభివృద్ధిపైన ఒక నమూనా ఏర్పాటు చేసుకుని, ప్రాంతాల భౌగోళిక, చారిత్రిక, సాంస్కృతిక ఉనికికి విఘాతం ఏర్పడకుండా, ప్రజలను నిర్వాసితులను కానివ్వకుండా, పంట భూములను బీడు భూములుగా మార్చకుండా, వ్యవసాయాన్ని విధ్వంసం చేయకుండా జరిగే ఏ అభివృద్ధికైనా అందరూ జై అంటారన్న వాస్తవాన్ని గుర్తిస్తారని ఆశిద్దాం.

– నండూరి రాజగోపాల్

కథ

# నేనూ, పి. వి. శివం



**డా. వి. చంద్రశేఖరరావు**

***పదకొండు గంటలకి ఫోన్ వచ్చింది. "మీ నాన్న" అంటూ మొదలుపెట్టింది ఫోన్‌లోని అమ్మాయి. "పి. వి. శివం" అన్నాను నేను. ఈ పి. వి. శివాలు ప్రత్యేకమైన కేటగిరి మనుషులు. కాలం చెల్లిన ఆదర్శాల కొయ్య గుర్రాలపై ఇప్పటికీ ఊరేగుతుంటారు. ప్రతీదీ వ్యాపారమైన కాలంలో వీళ్ళు సమాజానికి ఎక్సెస్ లగేజి లాంటి వాళ్ళు. "ఆయన హాస్పిటల్‌లో ఉన్నారు, సెయింట్ జోసెఫ్స్‌లో", మృదువైన కంఠస్వరం. "మీరు ఎవరు" అన్నాను నేను. ఎవరి గురించి అయినా వివరాలు తెలీకుండా రిలేషన్‌షిప్‌లోకి వెళ్ళడం ఇష్టం లేదు నాకు. అవన్నీ నా రూల్స్ ఆఫ్ ది గేమ్.***

**గుంటూరులో** ఒక పౌర సన్మానం కోసం వచ్చాడు పి. వి. శివం. అరవైల్లో గుంటూరు మున్సిపాలిటీకి వైస్ ఛైర్మన్‌గా చేశాడు ఆయన. నగరానికి ఎన్నో అద్భుతాలు చేసిన మనిషిగా చెప్పుకుంటారు. టౌన్ డెవెలప్‌మెంట్ కోసం తన భూమిని సైతం అమ్మాడు అని చెప్పుకుంటారు.

రాత్రి అమ్మ ఫోన్ చేసింది. "ఆయనకి తోడుగా వెళ్ళు. నెల క్రితమే స్ట్రోక్ వచ్చిన మనిషి" అంది. ట్రైన్లో కానీ, దిగిన తరువాత కానీ, ఆయన నాతో రావడానికి ఇష్టపడలేదు. తన ట్రాలీ బ్యాగ్‌ను తానే లాక్కుంటూ ఒక్కడే టాక్సీలో హోటల్‌కి వెళ్ళాడు. ఆయన దిగిన అదే హోటల్లో నేను ఇంకో రూములో చేరాను. ధనపిశాచి, ఫాలెన్ ఏంజెల్ అంటూ నా గురించి అందరికీ చెప్తాడు ఆయన. రియల్ ఎస్టేట్, కార్ల వ్యాపారం – కోట్ల టర్నోవర్ నాది. నాలుగు కార్లు, జుబ్లీ హిల్స్‌లో పెద్ద బంగ్లా...ఈయన మాత్రం నాకు దూరంగా సికింద్రాబాద్, మారుమూల ప్రాంతంలో ఒక బేకరీ పెట్టుకొని కేకులు అమ్ముకొని బ్రతుకుతుంటాడు. పేరుకి బేకరీయే కాని... దాని నిండా వందలాది పుస్తకాలు. కేకులు తింటూ, టీ తాగుతూ ఒక పుస్తకాన్ని చదువుతూ ఆయన లాగే కాలం విలువ తెలియని వాళ్ళు అక్కడ మూగుతుంటారు. సాయంకాలం వేళ ఈయన లాంటి ఓల్డ్ టైమర్స్ అక్కడ చేరుతారు...ఒక కాలపు కలల గురించి, వినియోగం లేని సమాజ సూత్రాల గురించి మాట్లాడుకుంటూ, మళ్ళీ ఒక గొప్ప కాలం వస్తుంది, ఈ స్వప్నం నిజం అవుతుంది అంటూ తీర్మానించుకొని...

హాస్పిటల్ బయట ఒక చురుకు కళ్ళ అమ్మాయి "నేను భాను" అంటూ చేయి చాపింది. హలో అంటూ లోపలికి నడిచాను.

నీరసంగా ఉన్నాడు ఆ మనిషి. తెల్లటి గుబురు గడ్డం, తలపై మిగిలిన కొద్దిగా తెల్ల జుట్టుతో శిశువుల ముఖంలో కనబడే గొప్ప సౌందర్యం ఆయన ముఖంలో...ఫుట్‌బాల్ మ్యాచ్లు, కోఠి బుక్ స్టాల్స్, పారడైస్‌లో ఛాయి బిస్కట్లు, ట్యాంక్ బండ్‌పై రన్నింగ్ రేస్లు, వుండుండి ఒక్కసారిగా శ్రీశ్రీ అనే కవి రాసిన కవితలను పెద్దగా పాడటం, మిత్రులందరి మధ్య వీడు "నా లెనిన్" అంటూ నన్ను పరిచయం చెయ్యటం...

"ఏమైంది" అన్నాను, ఆ మెరుపు కళ్ళ అమ్మాయితో. "ఉదయం మా ఇంటికి వచ్చాడు. హనుమయ్య మాస్టారు ఇంటికి తీసుకువెళ్ళమని మెట్లు దిగుతూ జారి పడ్డాడు". హఠాత్తుగా ఆమె కళ్ళలోకి సూటిగా చూస్తూ "మీరు ఏం చేస్తుంటారు?" అన్నాను. చురుకుగా గంభీరంగా నా వైపు చూస్తూ..."I am a sex worker" అంది. "జోక్ చేస్తున్నారా?" అన్నాను. ఆ అమ్మాయి నిర్లిప్తంగా చూసింది. "ఐ ఆమ్ ఫేమస్ విత్ ఏజెడ్ కస్టమర్స్. కానీ ఈ పెద్దాయన, హి టచ్డ్ మై హార్ట్", అంది ఎటువైపో చూస్తూ.

ఆ అమ్మాయి బయటకి వెళ్ళిన సమయంలో ఆయన దగ్గరికి వెళ్ళి "ఏమిటిది ఇట్లాంటి మనిషితో" అన్నాను నిరసనగా. "ఆ అమ్మాయి నా ఫ్రెండ్" అన్నాడు పి. వి. శివం. "ఇట్లాంటి బిచ్‌తో" ఉక్రోషం పట్టలేక పెద్దగా అరిచాను. కళ్ళలో నిప్పులు రాలుస్తూ ఈడ్చి నా చెంపపై కొట్టాడు పి. వి. శివం. "గెట్ లాస్ట్, నువ్వు ఒక మృగానివి" అంటూ బయటకి చేయి చూపించాడు. ఆ రోజు అంతా హాస్పిటల్ మెట్లమీదే గడిపాను.

**2.**

ఆ మరుసటి రోజు ఆయన్ని తీసుకొని హోటల్‌కి వెళ్ళాను. కానీ ఆయనతో పాటు తన గదిలో ఉండడానికి ఒప్పుకోలేదు. మధ్యాహ్నం "కాస్త విస్కీ తాగాలని ఉంది", అని కోరాడు. రెండు మూడు పెగ్గుల తర్వాత బిగుసుకున్న తలుపులు మెల్లగా తెరుచుకున్నాయి. ఆయన, జ్ఞాపకాలను ఒక్కొక్కటి బయటకు తీస్తున్నాడు. యూనివర్సిటీ రోజులు, అమ్మతో పరిచయం, పేలవమైన శ్రీశ్రీ మార్కు కవితలు..."అప్పట్లో సోవియట్ సాహిత్యం గురించి మాట్లాడుకోవటం ఎంతో ఇష్టంగా ఉండేది. మీ అమ్మకి గోర్కి అంటే ఇష్టం. నాకు మాత్రం చెహోవ్, దోస్తోవ్ యెస్కీ అంటేనే ఇష్టం. మీ అమ్మ ఎప్పుడూ ఒక గోర్కి పుస్తకంతోనే ప్రత్యక్షం అయేది. మీ అమ్మను నేను ఇష్టంగా నటాషా అని పిలుచుకునేవాడిని". ఆయన మరో రెండు పెగ్గులు తీసుకున్నాడు. గాఢమైన తాత్విక గాథలా మారిపోయాడు. చిన్న చిన్న శకలాలుగా అక్కడ ఇక్కడ పడివున్న దృశ్యాలన్నీ బయటకి తీస్తున్నాడు..."ఇది నా ముఖం, ఇది నా పోరాటం. ఇదిగో ఇక్కడ పరిచిన ఇదంతా నా జీవితం. ఇదిగో బహుశా ఇదే నా మరణం. ఎందుకు ఎట్లా ఎప్పుడు అని ఎనలైజ్ చేసుకోలేదు. I have not lived in vain" అట్లా కబుర్లు చెబుతూ మంచంపైన పడిపోయాడు ఆయన.

రాత్రి పది గంటల సమయంలో తలుపు మీద శబ్దం. "ఒక చోటకి వెళ్ళాలిరా", అంటూ నాకు ఆర్డర్ వేసి బయటకు నడిచాడు. ఎక్కడికి అన్నట్లుగా చూసాను. "ఆత్మహత్య చేసుకున్న ఒక కవి ఇంటికి వెళ్దాం" అని అన్నాడు. నాకు చిరాకు వేసింది. "వాడికి మనకి సంబంధం ఏమిటి. వాడెవడో సూసైడ్ చేసుకుంటే మనం ఎందుకు వెళ్ళటం" అని అన్నాను. పి. వి. శివం నాకేసి జుగుప్సగా చూసి ఒక్కడే హోటల్ బయటకి నడిచాడు. విధిలేక నేను ఆయన వెంట నడిచాను. ఒకే గది ఇల్లు...ఆత్మహత్య చేసుకున్న రాజు అనే కవిది. ఒక అమాయకమైన పల్లెటూరి మనిషి బయటకు వచ్చి ఎవరు, ఏమి కావాలి అంటూ, పి. వి. శివం లోపలికి నడుస్తూ ప్రేమగా ఆ పిల్ల తల నిమిరాడు. లోపలికి వెళ్ళి ఒక చిన్న బల్లపై కూర్చున్నాడు. ఆవిడ పేరు రేణుకా దేవి. చూస్తుండగానే పి. వి. శివం, ఆ అమ్మాయితో ఒక దుఃఖపు గాథను పంచుకోవటం మొదలు పెట్టాడు.

ఆ చిన్న గదిలో ఉండాలి అంటే నాకు అన్ ఈజీగా ఉంది. ఇల్లు కాదు, మినేచర్ అడవిలా ఉంది. దుప్పి కొమ్ములు, పలచటి దరువు, మట్టిబొమ్మలు, భీకరంగా చూసే అడవి దేవతల రూపాలు అదేదో పురాణకాలపు సెట్టింగ్ లాగా ఉంది. ఆ చనిపోయిన మనిషి భార్య మరీ అమాయకురాలిలా పల్లెటూరు దేవతలా ఉంది. రెండు ఏళ్ళ కొడుకు ఒక మూలన పడుకొని వున్నాడు. కనపడని మరణం ఏదో నన్ను భయానికి గురి చేసింది. ఆ ఆత్మహత్య చేసుకున్న మనిషి మళ్ళీ ప్రత్యక్షం అవుతాడేమో అని అనిపించింది. ఉరుములు, మెరుపులు, ఆకాశం చీలిపోవటం, ఎరుపురంగు కలలు, సమాధులు చీల్చుకొని డప్పులు కొమ్ముబూరా, ఒక యుద్ధనాదంతో అతను మళ్ళీ ప్రత్యక్షం కాబోతున్నాడు అనిపించింది. గంట గడిచినాక ఆయన మెరుపు కళ్ళ భానుకి ఫోన్ చేసాడు. భాను పొడవాటి కారియర్, పళ్ళు ఫలహారాలతో ప్రత్యక్షం అయ్యింది. ఆ దృశ్యం నాకు ఎందుకో సినిమాటిక్‌గా అనిపించింది. పి. వి. శివం అన్నం ముద్దలు కలిపి ఆ అమ్మాయికి తినిపించడం, నిద్రలేపి పసివాడికి రెండు ముద్దలు తిన్పించడం ఇదంతా ఒక సెంటిమెంటల్ ట్రాష్‌గా అనిపించింది. ఈ రాత్రికి ఇక్కడే పడుకుందాం అంటూ ఆయన డిక్లేర్ చేసాడు. పి. వి. శివం, భాను అక్కడే ఆ ఇరుకు గదిలో పడుకున్నారు. నేను బయట టాక్సీలో కాలక్షేపం చేశాను. నా లాజిక్‌కి ఏ మాత్రం అందని మనిషి ఈ పి. వి. శివం. మరుసటి రోజు ఉదయాన్నే అక్కడ నుంచి బయలుదేరుతూ వెళ్ళేముందు ఒక చెక్కును ఆ ఆడమనిషి చేతుల్లో పెట్టాడు.

పొద్దున్నే పి. వి. శివం అమరావతి వెళ్దామంటూ బయలుదేరదీసాడు. ఆయన చిన్ననాటి మిత్రుడు హనుమయ్య ఆచూకి తెలిసిందని, అమరావతిలో ఉన్న ఒక వృద్ధాశ్రమంలో వున్నాడని భాను కనిపెట్టింది. ఇన్నోవా కారు కోసం మిత్రుడికి ఫోన్ చేసాను. వద్దు బస్‌కి వెళ్దామంటూ మొండికేశాడు. బస్టాండులో భాను ఎదురు చూస్తుంది. బస్సంతా ఖాళీగా ఉంది. బస్‌లో ఒక నడికారు ఆడమనిషి. ఆడమనిషి ఒళ్ళో కూర్చున్న నాలుగేళ్ళ ఆమె కొడుకు. నల్ల బంగారంలా ఉదయపు ఎండలో ఆడమనిషి మిలమిల లాడుతోంది. పొలాల్లో తరచుగా ఎదురయ్యే భూమి పుత్రికలా ఉంది. చేతులు బలంగా ఇనుప చేతుల్లా ఉన్నాయి. రష్యన్ కథలో కనపడే పాత్రలా

**'చినుకు'లో ప్రచురించిన కథలలో ఒక ఉత్తమ కథకు శ్రీ యండమూరి వీరేంద్రనాథ్ ప్రకటించిన నగదు పురస్కారానికి నేను రచించిన ఈ 'నేనూ, పి.వి.శివం' కథను పరిగణించవద్దని విజ్ఞప్తి చేస్తున్నాను**

**- వి.చంద్రశేఖరరావు**

ఉందావిడ. ఉదయమే కానీ ఉక్కపోస్తుంది. ఆమె నల్లటి రగ్గు కప్పుకొని ఉంది. పి. వి. శివం పలకరింపుగా "ఇంత ఉక్కపోతలో కూడా రగ్గు కప్పుకున్నావే" అన్నాడు. ఆమె పట్టించుకోకుండా బస్సు బయటకి చూస్తుంది. "సెప్టెంబరు నెలలో కూడా ఇంత ఉక్కగా ఉందే" అన్నాడు పి. వి. శివం ఆమె వైపు చూస్తూ. ఆమెను గట్టిగా కరుచుకుని కూర్చున్న పిల్లవాడు లేచి వాళ్ళమ్మ సంచిలోంచి సెల్‌ఫోన్ తీసాడు. పాట పెట్టు అంటూ సెల్‌ఫోన్ ఆమె చేతిలో పెట్టాడు. ఆమె తన ఒంటి మీద రగ్గును పిల్లవాడి చుట్టూ కప్పి సెల్‌ఫోన్ నొక్కింది. 'భూమి మనదిరో, ఈ భూమి మనదిరో' గద్దరు పాట పెద్దగా వినపడింది. కుర్రవాడు లేచి పాటకు అనుగుణంగా చిందు వేస్తున్నాడు. నేను ఉలిక్కిపడ్డాను. పి. వి. శివం మరొకసారి ఆమెతో మాటలు కలపడానికి ప్రయత్నించాడు, ఆమె పట్టించుకోలేదు. కుర్రవాడు ఇంకా గద్దరు పాటకు చిందులేస్తూనే వున్నాడు. ఆమె తన బొడ్డులో ఉన్న గుడ్డసంచి బయటకు తీసింది. "ఏదైనా ఉద్యమంలో పని చేస్తున్నావా?" అన్నాడు పి. వి. శివం. ఆమె పట్టించుకోలేదు. గుడ్డ సంచిలోంచి ఆకు, వక్క బయటకు తీసి దానికి కొంచెం పొగాకు ముక్కను కలిపి దానిని నోట్లో వేసుకుంది. కిటికీలోంచి బయటకు చూస్తూ తూ అంటూ ఊసింది పెద్ద శబ్దంతో. ఆమె ముఖంలో ఏదో కోపం కసి నిరసన తోచాయి. అన్ని వైపులా నుంచి ఉదయపు ఎండా. బస్సులో మేం ముగ్గురం, ఆడమనిషి, పిల్లవాడు తప్ప ఇంకెవరు ఎక్కలేదు. కండక్టర్ బస్ ఎక్కాడు. తన సీట్‌లో కూర్చుని టిక్కెట్ తీసుకోండి అని అరిచాడు. పిల్లవాడు వెళ్ళి 50 నోటు ఇచ్చి రెండు టిక్కెట్లు అన్నాడు. సీటు క్రింద ఉన్న గొర్రెపిల్లకి కూడా తీసుకో అన్నాడు కండక్టర్. సీటు క్రింద బుజ్జి గొర్రెపిల్ల ఇప్పుడే తల్లి కడుపు నుంచి బయటకు వచ్చినట్లు 'లేతగా పచ్చిగా ముద్దుగా, ముదురు గోధుమ రంగులో' వుంది. సీటు క్రింద సన్నటి త్రాడుతో కట్టేశారు దాన్ని, దానికి కూడా టిక్కెట్ ఇచ్చాడు కండక్టర్. ఇప్పుడు ఆ తల్లి ఒడిలో కుర్రాడు. కుర్రవాడి ఒడిలో గొర్రెపిల్ల.

బస్ బయలుదేరింది. విశాలమైన రోడ్లు, లేటెస్టు కార్లు, పొలిటీషియన్ల కటౌట్లు, గుంటూరు తన రూపం మార్చుకుంటుంది. రోడ్డు పొడవునా కొత్త కొత్త అపార్టుమెంట్లు, మాల్స్, మేకపిల్ల లాంటి గుంటూరు పులిలా మారటానికి ప్రయత్నిస్తుంది.

కిటికీని ఆనుకొని పి. వి. శివం కునుకు తీస్తున్నాడు. బస్‌లో తల్లి, కొడుకుల కబుర్లు మాత్రమే వినిపిస్తున్నాయి. పిల్లవాడు హఠాత్తుగా వాళ్ళ అమ్మను మేకపిల్ల కథ చెప్పమన్నాడు. ఆ తల్లి పెద్దగా ఆలోచించకుండానే కథను మొదలు పెట్టింది. ఒక మేక, కాదు వందకు పైగా వున్నాయి. మేకల చుట్టూ ఇనుప కంచ వేసారు. పచ్చటి నేల...మిలమిల మెరుస్తున్న అటుప్రక్క కొండల దాకా పెరిగిన ఆకుపచ్చని నేల. ఆ ప్రదేశానికి వెళ్తే ఆ మేకలు మన వైపే చూస్తున్నట్లుంటాయి. ఆ మేకలు ఆ కంచలో ఎప్పటి నుండి వున్నాయో తెలియదు కాని అక్కడంతా ఉచ్చ కంపు మేకల పెంటికల వాసన.

ఆ మేకలు పెద్దగా చప్పుడు చేయవు, అరవవు, అటూ ఇటూ పరిగెత్తవు, వాటికి కాపలాగా ఎవరూ ఉండరు. పొద్దున్నే గడ్డిపరకలను నములుతూ కనిపిస్తాయి. జాగ్రత్తగా గమనిస్తే మేకల కాళ్ళకు నైలాన్ తాళ్ళు కట్టి వుంటాయి. అవి చాలా పొడుగు తాళ్ళు. మేకల కళ్ళన్నీ దిగులుగా ఉంటాయి. ఏమిటీ – బ్రతుకు అన్నట్లుగా వుంటాయి.

ఆడమనిషి గొంతు ఖంగుమని మ్రోగుతుంది. ఈ కథ ఈ బస్ ప్రయాణం ఇదంతా విసుగ్గా వుంది. నాకు పి. వి. శివం మీద చెప్పలేని కోపం వేసింది. రోడ్డు పొడవునా కొత్త కొత్త నిర్మాణాలు. ఆ నిర్మాణాలు చూస్తే ఆశగా వుంది. కొత్త వ్యాపారాలు కొత్త అవకాశాలు భవిష్యత్ అంతా ఇక్కడే వున్నట్లనిపిస్తుంది. రాజధాని ప్రకటన వచ్చిన వెంటనే 50 లక్షలు ఇక్కడ ఇన్‌వెస్ట్ చేసాను. అవన్నీ రైతులు దగ్గర కొన్న భూములు. అవి గవర్నమెంటుకిచ్చి పూలింగ్‌లో కలిపి, రేపు కోట్ల మీద లాభాలొస్తాయి. ఆడమనిషి మేకల కథ చెబుతూనే వుంది. కథలో పులులు లేవు కాని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేవారు బిల్డర్లు ఉన్నారు. ఆకుపచ్చ నేల మాయమైంది. బోను లాంటి కాంక్రీట్ ఇళ్ళు. ఆ బోనులో మేకలు వాటికి ప్రత్యేకమైన ఆహారం. బోనులోని మేకలు ఒక్కొక్కటి మాయమవుతున్నాయి. అవి పారిపోయాయో కబేళాకి వెళ్తున్నాయో ఎవరికీ తెలియదు. ఇప్పుడక్కడ ఒక్క మేకే వుంది. అది బోనులో నుంచి బయటికి వచ్చి బిక్కుబిక్కుమంటూ చూస్తుంది. ఆడమనిషి కథ కొనసాగుతునే వుంది. వినే మూడ్ లేక నా సెల్ ఫోన్‌లో పాటలు ఆన్ చేశాను.

పి. వి. శివం నిద్దర లేచినట్లున్నాడు, ఆ అమ్మాయితో కబుర్లు మొదలుపెట్టాడు.

అమరావతిని చూస్తూనే నాలో ఏదో హుషారు. ఇన్వెస్టర్ల స్వర్గం అక్కడ రాబోతుంది. అటూ ఇటూ ఎటు చూసినా అవకాశాలే. బస్ దిగుతూనే పి. వి.శివం ఆటోను పిలిచాడు. నేను కారులో వెళ్దామంటూ నసిగాను. బయట భయంకరమైన ఉక్కపోతా, ఎండా. శరీరమంతా చెమటలు. వృద్ధాశ్రమం ఊరి చివర నది ఒడ్డున వుంది. ఆటో దిగి అటువైపు నడుస్తుంటే నదిలో ఈదుతున్న నల్లటి గేదెలు, దున్నలు కనిపించాయి. తొమ్మిదో పదో వుంటాయి. నీటిలో మునిగి, స్నానం చేస్తున్నాయి. వాటి కొమ్ములు, ముట్టె మాత్రమే కనిపిస్తున్నాయి. వాటిలో నుంచి ఒకటి పైకి లేచి, అద్భుతమైన దృశ్యం. నల్లటి రాతిగేదెలా వుంది. భాను, శివం వాటివైపు నడిచారు. నది ఒడ్డున అడవి పూలచెట్లు ఏపుగా పెరిగున్నాయి. భాను ఆ గేదెవైపు వెళ్ళి దేవతా మూర్తి ముందు తల వంచి నిలబడినట్లుగా క్రింద కూర్చొని రెండు చేతులు వాటి వైపు చాచి. పి. వి. శివం గట్టు పైన ఉన్న పచ్చగడ్డిని వాటిపై విసిరాడు.

పదిగంటలయింది. ఎండ వేడి తట్టుకోలేనట్లుగా ఉంది. నా చేతిలోని బిస్‌లరీ బాటిల్‌లో నీళ్ళు తాగి ఆ బాటిల్‌ని గేదెలవైపు విసిరాను. అది వెళ్ళి ఒక గేదె కొమ్మును తాకింది.

అప్పటివరకు నీళ్ళలో పడుకుని స్నానం చేస్తున్న ఆ గేదె ఒక్కటీ ఒక్కసారిగా పైకి లేచింది. తల విదిల్చి వాడియైన కొమ్మును కదిలిస్తూ హుంకరించింది. మిగిలిన గేదెలు కూడా నీళ్ళలోంచి పైకి లేచాయి. మాపైకి దాడి చేయబోతున్నట్లుగా అన్నీ ఒక్కసారిగా ఒడ్డువైపు కదిలాయి. భయంగా అరిచాను. పి. వి. శివం, భాను ఆశ్రమం వైపు నడుస్తున్నారు. వెళుతూ వెళుతూ భాను వెనక్కి తిరిగి నావైపు చూసింది. ఆ ముఖంలో వుంది వెక్కిరింతా? జాలా?

పి. వి. శివం వెతుకుతున్న హనుమయ్య ఇప్పుడా వృద్ధాశ్రమంలో లేదు. "ఈ మధ్య కాలంలో చుట్టుప్రక్కల ఊళ్ళ నుంచి ముసలి రైతులు కూడా వచ్చి ఆశ్రమంలో చేరుతున్నారు. వచ్చే విరాళాలు తగ్గిపోయాయి. అందుకే కొంత మందిని వాళ్ళ ఇళ్ళకు పంపాము. వాళ్ళలో ఈ

అనుమయ్య ఒకడు" అంటూ ఆశ్రమం మేనేజరు చెప్పాడు. పి. వి. శివం ముఖంలో చెప్పలేని నిరుత్సాహం. చాలాసేపు ఆలోచించి తన సంచీలో నుంచి చెక్‌బుక్ తీసి ఐదు లక్షల విరాళం ఆశ్రమం పేరుతో రాశారు.

"హనుమయ్య మాస్టారుని వెనక్కి ఆశ్రమంలోకి పిలిపించండి. వాళ్ళు మహానుభావులు. వాళ్ళని అట్లా అనాథలుగా వదిలివేయద్దు" అంటూ మేనేజరు వైపు చేతులు జోడించాడు.

తిరిగి బస్టాండ్ చేరాము. బస్టాండ్ గేటు ఎదురుగా ఒక షామియానా, టార్పాలిన్ పట్టాలతో వేసిన షామియానా. ఉదయం బస్‌లో కనబడ్డ ఆడమనిషి, ఆమె కొడుకు కూర్చుని వున్నారు. ప్రభుత్వం లాక్కున్న పట్టా నెంబరు 56/82ను తిరిగి ఇచ్చేయాలి అంటూ ఒక బ్యానర్ వుంది ఆ టెంట్‌లో. పి. వి. శివం షామియానా వైపు నడిచాడు. కాసేపు ఆమె పక్కనే మౌనంగా కూర్చున్నాడు. పిల్లవాడు సెల్‌ఫోన్ నొక్కి ఉద్యమం పాట వినిపిస్తున్నాడు.

పి. వి. శివం ఆ ఆడమనిషితో మాట్లాడుతుండగా ఎదురైన ఒక దృశ్యం నన్ను భయభ్రాంతుడను చేసింది. భయానకమైన కలలా నన్నా దృశ్యం చాన్నాళ్ళపాటు వెంటాడింది.

వి.ఐ.పి. ఎవడో ఆ రోడ్డు మీద వెళ్తున్నాడు, ముందు ఓ నాల్గు, వెనుక ఓ నాల్గు కార్లు పోలీసులు హడావుడి చేస్తున్నారు అన్ని వాహనాలను ఆపి. వాళ్ళ కళ్ళు రోడ్డు ప్రక్కన వున్న శిబిరం పైన పడ్డాయి. పదిమంది పోలీసులు శిబిరాన్ని చుట్టుముట్టి కర్రలనీ, టార్పాలిన్‌ను పీకి వేస్తుండగా ఆ ఆడమనిషి రుద్రకాళికలా మారి పెద్దగా అరుస్తూ, కేకలు వేస్తూ వాళ్ళను ప్రతిఘటించింది. సరిగ్గా అప్పుడే ఆ సంఘటన జరిగింది. భయం గొలిపే ఒక దృశ్యం రోడ్డుపై ప్రత్యక్షమైంది. నది నీళ్ళలో నిద్రిస్తూ సేద దీరుతున్న మహిషాల గుంపు, ఎవరో వాటిపై దాడి చేసి వెంటాడి రెచ్చగొట్టినట్లుగా మహా క్రోధంతో ఒక యుద్ధోన్మాదంతో రోడ్డుపై పరిగెడుతున్నాయి. ఆ దృశ్యమంతా ఒక యుద్ధ సన్నివేశాన్ని గుర్తు చేసింది. రోడ్డు పైన మనుషులందరూ భయంతో అటు ఇటు పరిగెట్టారు. కొమ్ముల ఆయుధాలతో ఆ మహిషాలు సమస్తాన్ని ధ్వంసం చేయటానికి వస్తున్నట్లుగా దూరం నుంచి చూస్తే రోడ్డుపై అవి మాత్రమే మహా క్రోధంతో బుసలు కొడుతూ. ఆ దృశ్యం చాలా రోజుల పాటు నన్ను వెంటాడింది.

కవిత

# స్వర్గం తర్వాత, నరకానికి ముందు

**ఏం ప్రపంచమిది**
కళ్లజోడు సరిగ్గా పెట్టుకుంటే
తలకిందులుగా పెట్టుకున్నానంటుంది,
నేను స్పష్టంగా బిగ్గరగా మాట్లాడుతుంటే
వినపడటం లేదంటుంది, అర్థం కాలేదంటుంది
సర్వోత్కృష్టమయిన భావనలతో
ఒక రంగుల ప్రపంచంలో సంచరిస్తుంటే
అయోమయంగా అవకతవకగా
అబ్సర్డ్‌గా వున్నానంటుంది
తెరమీద కదలాడేవన్నీ, నాకర్థమౌతుంటే
మీకెందుకర్థంగావు
రెండు శిఖరాల మధ్య తాళ్ల వంతెన మీద
నేనుయ్యాల లూగుతూ నర్తిస్తుంటే
పిచ్చి చూపుల ముఖ ప్రపంచాలు
ఆవిష్కరించానంటుంది
అర్థంలేని ప్రపంచం
అర్థాల కోసం వెతుకులాడుతుంది
నేనర్థవంతంగా అమేయంగా
రసాధి దేవత స్థాయికి ఎదుగుతుంటే
వేయి రేకుల పుష్పాల విలాపాలు చేశానంటుంది
శిరసుమీద సీలలు దిగ్గొడుతుంది
రెండు ప్రపంచాలున్నాయా?
నా ప్రపంచంలోకి మీరు
మీ ప్రపంచంలోకి నేను ప్రవేశించలేమేమో –
అర్థరహితంగా బతుకుతున్న ప్రపంచం
తలకిందులుగా బతుకుతున్న ప్రపంచం
మంచుగడ్డ ప్రపంచం
తలవెనుక కళ్లున్న ప్రపంచం
దీన్ని రంగుల్లో ముంచి పైకి తీస్తే తప్ప
ఒక కవితను స్నానం చేయించి శుద్ధి చేస్తే తప్ప
దీనికి చిత్తశుద్ధి రాదు, అప్పుడుగానీ
అన్నింటినీ అక్షరబద్ధంగా, ఉద్యానవన సదృశంగా
చూడటం దీనికి తెలియదు
కొంచెం ఆగండి,
నా కుడి చేతి మీద సీతాకోక చిలుక వాలింది
నా నెత్తిమీద పండిన ఆకు రాలింది
భుజం మీద పాట పాడే కోయిల వాలింది

**కె.శివారెడ్డి**

### 3.

ఆదివారం సాయంకాలం అవార్డు ఫంక్షన్. వెంకటేశ్వర విజ్ఞాన కేంద్రం. గుంపులు గుంపులుగా ఈ పి. వి. శివం లాంటి ఓల్డ్ టైమర్స్ ఆ సభకు వచ్చారు. బయట చిన్న చిన్న సమూహాలుగా చీలిపోయి గత కాలపు ముచ్చట్లు చెప్పుకుంటున్నారు. హోటల్ నుంచి బయలుదేరుతున్న ఆయన ముఖం చుట్టూ ఒక కాంతి వలయం కనపడసాగింది. సాయంకాలపు లేత ఎండ, శీతాకాలపు చల్లని గాలి, ఎండిన ఆకులపై పాదాల చప్పుళ్ళు. "ఈ రోడ్లు అన్నీ నాతో మాట్లాడుతున్నట్లుగా ఉన్నాయి" అన్నాడు పి. వి. శివం. కారు వెనుక భాను, ఆమె ఎనిమిదేళ్ళ కొడుకు ఉండడం నాకు నచ్చలేదు. ఈ ఒక్కరాత్రి గడిపేస్తే చాలు, ఈయన గురించి నా బాధ్యత తీరిపోతుంది అనుకున్నాను. సంవత్సరాలన్నీ కళ్ళముందే కదులుతున్నట్టుగా వుంది. మనుషులు అందరూ వెనక్కు గతంలోకి అదృశ్యం అవుతూ మళ్ళీ ప్రత్యక్షం అవుతూ...ఈ వీధులలో నేను జీవించాను. AC కాలేజీలో BA చేసిన రోజులు. ప్రొద్దున్నే సైకిల్‌పై న్యూస్‌పేపర్లు ఇచ్చిరావటం. సాయంకాలం కవిత్వమో, నవలో పదిమంది కూర్చొని చర్చించుకోవటం. జీవితం అంటే మనుషుల మంచితనమే అని గాఢంగా నమ్మిన రోజులు. భీకరమైన సింహం లాంటి కాలానికి రొమ్ము చూపి నిలిపిన రోజులు... పి. వి. శివం కళ్ళలో సన్నటి నీటి తెర.

ఫంక్షన్ హాల్‌కి చేరుతూనే వందలమంది ఆయన చుట్టూ మూగారు. ఆయనని భుజాలపైకి ఎత్తుకొని లోపలికి తీసుకొని వెళ్ళారు. పి. వి. జిందాబాద్ అంటూ పెద్ద పెద్ద నినాదాలు. బయట డప్పుల నాదాలు, శ్రావ్యమైన సన్నాయి పాటలు, అదేదో ప్రత్యేకమైన దేశంలా ఉంది. మనుషులు ఇంత ఉత్సాహంగా ఆనందంగా వుండటం నాకు చాలా ఆశ్చర్యంగా ఉంది. ఆయన రెండు రోజులుగా వెతుకుతున్న హనుమయ్య మాస్టారు గారి మనవడు ఆ సభకు వచ్చాడు. తాతయ్య రాసిన పుస్తకాలు అంటూ హనుమయ్య మాస్టారి కవిత్వ సంకలనాలు ఆ కుర్రాడు పి. వి. శివంకి ఇచ్చాడు. అపురూపమైన ఆస్తిలా వాటిని గుండెలపైన హత్తుకున్నాడు. పి. వి. శివం కళ్ళలో నీరు, ఆ తరువాత మొదలైంది ఒక గొప్ప వేడుక. ఎవరెవరో మాట్లాడారు. రాసుకొచ్చిన ఉపన్యాసాలు కావు అవి. గుండెల్లో నుంచి ఉబికిన ఉద్వేగాల గాథలు అవి. చివరగా పి. వి. శివంను పట్టు శాలువా, గజమాలతో సన్మానించారు. పి. వి. శివం దేవతల మనిషిగా వెలిగిపోయాడు. ఆత్రంగా పట్టలేని ఆనందంతో గొంతు విప్పి మాట్లాడబోయి, మిత్రులారా, నా కామ్రేడ్స్, నాతో పాటు ఒక మధుర స్వప్నాన్ని కంటున్న నేస్తాల్లారా అంటూ మాట్లాడుతూ హఠాత్తుగా తట్టుకోలేని ఉద్వేగాల రాపిడికి నేలపై కూలిపోయాడు పి. వి. శివం. స్టేజి వైపు పరిగెత్తుకుంటూ వెళ్ళాను. ఆయన మిత్రుడయిన డాక్టర్ ఒకాయన టెస్ట్ చేసి ప్రమాదం లేదు అని సర్టిఫై చేశారు. పి. వి. శివంని స్టేజిపై నుంచి కిందకి తీసుకొని వచ్చారు. ఆ తరువాత గంట సేపు పైగా బృందగానాలు, జానపద నాట్యాలు, పాటలు ఆ హాలంతా గొప్ప ఆనందంతో వెలిగిపోతున్న దేవతల రాజ్యంలా ఉంది. సభ ముగిసింది. ఒక్కొక్కరి దగ్గరికి నన్ను తీసుకువెళ్ళి పరిచయం చేస్తున్నాడు పి. వి. శివం. ఈయన వాసుదేవ రావు, మెడికల్ కాలేజి ప్రొఫెసర్, ఈయన లంక నారాయణ, గ్రంథాలయ ఉద్యమ నాయకుడు...అట్లా ఒక్కొక్కరిని పరిచయం చేసుకుంటూ వెళ్ళాడు. ఒక మనిషిని చూడగానే ఆగిపోయి 'రారా' అంటూ నన్ను లాక్కొని వెళ్ళాడు. "ఈయన పులుపుల సార్, నాలో జ్ఞాన దీపాలని వెలిగించిన దేవుడు"...ఆ మనిషి కాస్త అపరిచితంగా గుర్తుపట్టనట్టుగా నా వైపు చూసాడు..."సర్, నేను వాళ్ళ అబ్బాయిని, ఆయన చనిపోయి ఇరవై ఏళ్ళు కావస్తోంది" అన్నాడు. ఆడిటోరియం నుంచి బయటపడ్డాక "అట్లా పేవ్‌మెంట్ మీద నడుద్దాం" అన్నాడు. ఈ మురికి పేవ్‌మెంట్‌ల మీద ఏంటి అని ముఖం చిట్లించుకున్నాను. ఈ రోజు పి. వి. శివంది, అతను ఏమి అడిగినా కాదనకూడదు అనుకుంటూ అతని వెనక నడవటం మొదలుపెట్టాను. మాతో పాటు భాను ఆమె కొడుకు. లీలామహల్ సెంటర్ దగ్గరికి వచ్చినాక "ఇక్కడ బజ్జీలు బాగుంటాయి తిందాం" అన్నాడు. నూనె కారుతూ ఉన్న ఆ బజ్జీలు ముట్టుకునే సాహసం చేయలేదు నేను. కాస్త దూరం వెళ్ళాక "ఇక్కడ టీ బాగుంటుంది" అని ఒకచోట ఆగాడు. వాళ్ళు ముగ్గురు అమృత పానంలా ఆ టీని తాగుతున్నారు. పేవ్‌మెంట్‌లపైన నడవటం కూడా ఎంత బాగుంటుంది అన్నాడు పి. వి. శివం. బ్రహ్మాండమైన వెలుగు, ఎటు చూసినా మానవ సమ్మేళనం, వాళ్ళందరూ మనల్ని రాసుకోవటం, మన లోపల నుంచి వెళ్తున్నట్లుగా... మనం నడుస్తుంటే మన పాదాల కింద గత సంవత్సరాలు అన్నీ ఒక్కొక్క జ్ఞాపకాన్నే చెప్పుకుంటూ...పదకొండు గంటలు దాటినాక "ఏదైనా బారుకు తీసుకెళ్ళు" అన్నాడు ఆయన. రెండు మూడు పెగ్గుల తరువాత ఆయన ఒక పాటని ఎత్తుకున్నాడు, జానపద గీతం...'బండిరా పొగ బండిరా' అంటూ. బారు మెల్లగా ఖాళీ అవుతుంది. లోపల పదిమంది కూడా లేరు. భాను ఒడిలో పిల్లవాడు నిద్రపోతున్నాడు. భాను మెల్లగా గొంతు విప్పింది. ఉర్దూ పాట. గజల్ లాంటిదే చాలా దుఃఖం ఉందా పాటలో...గొప్ప సుఖం కూడా ఆ పాటలో ఉంది. "మరో పాట మరో పాట" అంటూ భాను తోటి పది పాటలు దాక పాడించుకున్నాడు. ఆ పాటల మాధుర్యంలో తడిచి పి. వి. శివం చలించిపోయాడు. "నా తల్లి. నాతో హైదరాబాద్ వచ్చెయ్. రా... నా బేకరీలో పనిచేద్దువు గాని" అన్నాడు. ఆ అమ్మాయి "సరే" అంటూ తల ఊపింది. నాకు చిర్రెత్తు కొచ్చింది. ఈ మనిషికి సెనిలిటీ వచ్చింది. ఎక్కడెక్కడి లంపెన్‌ను తెచ్చి నెత్తిన పెట్టుకుంటున్నాడు అనుకొని ఒక్కసారిగా "నీకు ఏమైనా మతి పోయిందా" అని అరిచాను. "ఇలాంటి దాన్ని" అని, నా అరుపులకు బారు అంతా ఉలిక్కిపడింది. భాను ముఖం తెల్లగా పాలిపోయింది. పి. వి. శివం ముఖంలో ఎరుపు, కోపం. నావైపు వేలు చూపించి, "ప్లీజ్ గెట్ లాస్ట్ ఫ్రం దిస్ ప్లేస్" అని అజ్ఞాపించాడు.

### 4.

వేకువజామున ఐదు గంటలకు తిరిగి హైదరాబాదు ప్రయాణం అయ్యాము, భాను ఆయనను ప్రేమగా హగ్ చేసుకుంది. తను చేసిన ఖీర్ చిన్న బాక్సులో పెట్టి ఆయనకి ఇచ్చింది. ఒక చెక్కు ఆ అమ్మాయికి ఇచ్చినట్లు నాకు అనుమానం. మెరుపు కళ్ళతో ఆ అమ్మాయి గుడ్‌బయ్ చెప్తుండగా కారు ముందుకు కదిలింది.

సన్నగా వెలుగులు మొలుస్తున్న సమయానికి మేము సత్తెనపల్లి దాటాము. ఒక పల్లెటూరుని దాటుతుండగా, నడికారు మనిషి రోడ్ దాటుతూ కనిపించాడు, "జాగ్రత్త స్లో చేసుకో" అన్నాడు పి. వి. శివం. ఆ మనిషి తాగి ఉన్నాడేమో తూలు

**End of Preview.**

**Rest of the book can be read @**

[http://kinige.com/book/Chinuku+November+2016](http://kinige.com/book/Chinuku+November+2016)

* * *